క్లుప్తంగా

నేడు మండల సమాఖ్య సమావేశం

చాపాడు : స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద గురువారం మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు వెలుగు ఏపీఎం వెంకటరమణ తెలిపారు. సమావేశానికి మండల పరిధిలోని అన్ని గ్రామాఖ్యల అధ్యక్షులు, వెలుగు సీసీలు, యానిమేటర్లు, సిబ్బంది హాజరుకావాలని ఏపీఎం కోరారు.

ఇ-పంట నమోదు చేసుకోండి

మైదుకూరు : మండలంలో ప్రతి రైతు ఇ- పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న సూచించారు. బుధవారం ఆమె మండలంలోని ఎస్.ఎర్రబల్లె గ్రామంలో నిర్వహించిన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి పంట ప్రతి సర్వే నంబర్‌ను పరిశీలించి పంట నమోదు చేయాలని తెలిపారు. రీ సర్వే చేసిన గ్రామాల్లో సాగు చేసిన పంట పొలాలు విస్తీర్ణంలో తేడాలు ఉంటే ఆయా గ్రామాల వీఆర్‌ఓ, సర్వేయర్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కౌలు రైతులు పంట సాగు చేసేవారి పేరు మీద పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

ఆర్టీఓ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి బుధవారం ఆర్టీఓ కార్యాలయాన్ని సందర్శించారు. లైసెన్సు, ఎల్‌ఎల్‌ఆర్‌ల కోసం వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారి వాహనాలకు కార్యాలయ ఆవరణంలోనే పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ఆర్టీఓ మురళీధర్‌తో అన్నారు.

భూ సేకరణపై రైతులతో చర్చించిన జేసీ

మైదుకూరు : మైదుకూరు మీదుగా వెళుతున్న జాతీయ రహదారి -67 విస్తరణలో సేకరించాల్సిన అదనపు భూమి కోసం బుధవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మైదుకూరు ప్రాంతంలో పర్యటించారు. మైదుకూరు, నంద్యాలంపేట ప్రాంతాల్లో జాతీయ రహదారి -67 విస్తరణ కోసం అదనంగా ఐదుగురు రైతుల నుంచి 29 సెంట్లు భూమిని సేకరించాల్సి ఉంది. ఈ భూమికి ధర నిర్ణయించే విషయమై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ రైతులతో చర్చించారు. జేసీ వెంట జాతీయ రహదారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రఘుపతి, తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ మలికార్జున ఉన్నారు.

డీఎస్పీని కలిసిన మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ భక్తవత్సలంను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీకి శాలువా కప్పి కమిషనర్ సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులపై వారు చర్చించుకున్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా హరినారాయణ



పురంధేశ్వరి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న హరినారాయణ

ప్రొద్దుటూరు : బీజేపీ జిల్లా కార్యదర్శిగా అర్కటవేముల హరినారాయణను నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి చేతుల మీదుగా హరినారాయణ బుధవారం విజయవాడలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పురోభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలను అందరికి తెలియపరిచి అవినీతి రహిత సమాజం కోసం పాటుపడతానని ప్రకటించారు. పార్టీకి తనను జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కలసపాడు : స్థానిక ఎస్.కె.జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న లక్ష్మియోగిభరత్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించారు. ఈనెల 18న విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో లక్ష్మియోగిభరత్ 68 కేజీల జూనియర్స్ విభాగంలో బంగారు పతకం సాధించారు. ఎస్.కె. విద్యా సంస్థల సీఏఓ షేక్‌ఖాద్రి, ఏఓ వెంకటరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, పీడీ ఖాశింపీరాలు అభినందించారు.

ఉచిత పశువైద్యశిబిరం

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లెలో బుధవారం కడప పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) సౌజన్యంతో ప్రభలవీడు పశువైద్యాధికారి లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పశుసంవర్ధకశాఖ ఏడి కె.వెంకటసుబ్బయ్య, డీఎల్‌డీఏ కడప కార్య నిర్వహణాధికారి రమేష్‌కుమార్‌లు హాజరయ్యారు. ఏదైనా సమస్య వస్తే స్థానికంగా ఉన్న పశువైద్యాధికారి, గోపాలమిత్రలకు వెంటనే తెలియజేయాలన్నారు.

అడుగంటిన భూగర్భజలాలు

- ఎండుతున్న పంటలు
- సాగునీరు రాక వెలవెలబోతున్న చెరువులు
- 2019కు ముందు రోజులు గుర్తుకు వస్తున్నాయంటున్న రైతులు



నీరు లేక వెలవెలపోతున్న టీ.సంద్రపల్లె చెరువు



ఎండిపోతున్న సజ్జపంట

గోపవరం : వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటాయి. సాగునీరు రాక చెరువులు వెలవెలపోతున్నాయి. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన సజ్జ, వరిపంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 2019కు ముందు రోజులు గుర్తుకు వస్తున్నాయని రైతులు అంటున్నారు. కేవలం వర్షాధారంపైనే ఈ ప్రాంత రైతులు పంటలు సాగు చేసేవారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాంత రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని బ్రహ్మంసాగర్ ద్వారా సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో కాలువలు తవ్వించారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో తవ్విన కాలువలు నిరుపయోగంగా మారాయి. 2019కు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రహ్మంసాగర్ ద్వారా సాగునీరు అందిస్తామని ఈ ప్రాంత రైతులకు హామీ ఇచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించారు. వరుసగా నాలుగేళ్ళ పాటు బ్రహ్మంసాగర్ నీరు వచ్చాయి. దీంతో ఈ ప్రాంత రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో చెరువులన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వెంటనే బ్రహ్మంసాగర్ ద్వారా చెరువులకు నీరు అందుతాయన్న ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు కూడా తీసుకోలేదు. మండల వ్యాప్తంగా సజ్జ, వరిపంటను రైతులు సాగు చేశారు. సకాలంలో నీరు అందక పంటలు ఎండుతున్నాయి. వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిన దాఖలాలు లేవు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రోజులను తలుచుకుంటూ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు వచ్చినట్లైతే దాదాపు 5 వేల ఎకరాలకు పైగా రైతులు వరిపంటను సాగు చేయాల్సి ఉంది. కనీసం బ్రహ్మంసాగర్ ద్వారా అయినా చెరువులకు నీరు అందిస్తే కొంతలో కొంత అయినా పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2019కు ముందు వరుస కరువుతో ఈ ప్రాంత రైతులు ఎలాంటి పంటలు సాగు చేయలేక వ్యవసాయ కూలీ పనుల కోసం వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బ్రహ్మంసాగర్ నుండి చెరువులకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

చెరువులకు నీరు అందించాలి



గత ప్రభుత్వంలో వరుసగా నాలుగేళ్ళ పాటు బ్రహ్మంసాగర్ నుంచి చెరువులకు నీరు అందించారు. దీంతో సాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడలేదు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. చెరువులు నీరు లేక వెలవెలపోతున్నాయి. అధికారులు వెంటనే చెరువులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి.

\- జి.వెంకటరెడ్డి, రైతు, రాచాయపేట, గోపవరం

పంటలు ఎండుతున్నాయి



వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలో నీరు రావడం లేదు. 2019కు ముందు వరుస కరువుతో అల్లాడిపోయాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వరుసగా నాలుగేళ్ళ పాటు చెరువులకు సాగునీరు అందించారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని సాగునీరు అందించి ఆదుకోవాలి.

\- సి.హెచ్.నరసింహారెడ్డి, రైతు, రాచాయపేట, గోపవరం మండలం

ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు

కాశినాయన : మండలంలోని నరసాపురం ఏపీ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు సోసియల్, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు 70 రోజులు కావస్తోంది. ఇంత వరకు ఆ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

రేపు గ్రామ సభలు

చాపాడు : మండల వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు రవీంద్రారెడ్డి తెలిపారు. అల్లాడుపల్లెలో మధ్యాహ్నం 2గంటలకు, అన్నవరంలో ఉదయం 9.30గం, అయ్యవారిపల్లెలో మధ్యాహ్నం 3.30గం, బద్రిపల్లె, చాపాడు, చిన్నగురువళూరు, నాగులపల్లెలో 12గం, చియ్యపాడులో ఉదయం 10గం, ఖాదర్‌పల్లె, కుచ్చుపాపలో మధ్యాహ్నం 1గం, లక్ష్మీపేట, పల్లవోలులో ఉదయం 9.30 గంటలకు, మడూరులో 10గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పెద్దగురువళూరు, టీఓపల్లె, వెదురూరు, ఎస్.ఓబాయపల్లెలో 11గంటలకు, రాజువారిపేట, సోమాపురం, విశ్వనాథపురంలో మధ్యాహ్నం 2.30 గంటలకు, సీతారామాపురం, సిద్దారెడ్డిపల్లెలో మధ్యాహ్నం 3గంటలకు గ్రామ సభలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను గ్రామ సభల్లో తెలియజేయవచ్చని తహసీల్దారు చెప్పారు.

మహిళలకు రక్షణ లేదు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు : మహిళలకు రక్షణ లేకుండా పోయిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయం నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన సంఘటన మరువక ముందే నేడు మహారాష్ట్రలో ఆరేళ్ల చిన్నారులపై అఘాయిత్యం చేయడం మానవ సమాజానికే సిగ్గుచేటన్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ ఘటనపై దేశ వ్యాప్తంగా ఈ ఘటనపై పెద్ద దుమారం జరుగుతున్నా ఇప్పటికీ నిందితులను అరెస్టు చేయలేదన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న దుర్మార్గులను చట్ట ప్రకారం ఉరి తీయాలని కోరారు. మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : కలకతాలో ట్రైనీ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. స్థానిక సంజీవ్ నగర్‌లోని వాసవి ప్యారా మెడికల్ వృత్తి విద్యా కళాశాల వద్ద విద్యార్థులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలు పోసే డాక్టర్‌లకే రక్షణ లేకుండాపోవడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి ఇలాం సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జూనియర్ డాక్టర్ హత్యపై ధర్నా

పోరుమామిళ్ల : కలకతాలో జూనియర్ మహిళా డాక్టర్ హత్యపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. బెంగాల్ ప్రభుత్వం సరైన విధంగా స్పందించక పోవడం దారుణమన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా మంగళవారం రాత్రి పోరుమామిళ్లలో సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ జరిగింది. మస్తాన్ మహిళలపై దాడులు, అత్యాచారాలను సీపీఐ ఏరియా నాయకుడు మస్తాన్ ఖండించారు.

ఎస్ఐ, ఏఎస్ఐలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : తనను దూషించి, గాయపరచిన కల్లమల్ల ఎస్ఐ తిమోతి, ఏఎస్ఐ రమణలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్టీపీపీ జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్ ఎ.అంకన్న కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు, తన భార్య ప్రియాంకకు మధ్య విభేదాలు ఉన్నాయని, అయితే తన భార్య ఫిర్యాదుపై స్పందించిన ఎస్ఐ, ఏఎస్ఐలు స్టేషన్‌కు పిలిపించి బూతులు తిట్టి, కొట్టడంతో కాలి చిటికెన వేలు ఎముక విరిగిందని వాపోయాడు. ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో కూడా పోలీసులు బెదిరించారని చెప్పాడు. స్టేషన్‌కు వచ్చిన తన సోదరుడు, అతని భార్యను అసభ్యపదజాలంతో దూషించి అక్కడ నుంచి బయటకు పంపారని తెలిపారు. ఎస్ఐ, ఏఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో కుటుంబ సభ్యులు మేరి సుజి, ఏసన్న పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసిన జేసీ



రికార్డులు భద్రపరచిన గదిని పరిశీలిస్తున్న జేసీ అతిథి సింగ్

చాపాడు : స్థానిక మండల తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అతిధి సింగ్ తనిఖీ చేశారు. మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల గదిని పరిశీలించారు. రికార్డులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రపరచాలని సూచించారు. ఇదే క్రమంలో చాపాడు మండలంలో నిర్మితమవుతున్న గ్రీన్ ఫీల్డు హైవేలో పంట పొలాల బాధితుల వివరాలు, పరిహారం అందించిన, అందని వారి వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు యామిని, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మలదేవి

కలసపాడు : వర్షాభావ పరిస్థితుల వలన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నిర్మలదేవి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలని కోరారు. మరుగున పడిన ఎస్‌డబ్ల్యూపీసీలు మరలా పునరుద్ధరించాలన్నారు. వైద్యాధికారి స్వరూప మాట్లాడుతూ నియోజకవర్గంలోని కలసపాడు మండలానికి స్కానింగ్ సెంటర్ వచ్చిందని, పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెల 8, 9వ తేదీల్లో గర్భిణులు స్కానింగ్ చేసుకోవచ్చన్నారు. పీఆర్ ఏఈ హసీనాపర్వేజ్‌బేగం మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటర్నల్ సీసీ రోడ్లు, డ్యామేజీ సీసీ రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేసుకుని బాగు చేయించుకోవాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అల్లాబకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో పల్స్‌సర్వే, ఓడీఎఫ్ సర్వే 50 శాతం పూర్తైందన్నారు. అలాగే రోడ్లపై వృథాగా నీరు పోకుండా సర్పంచ్‌లు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తే బిల్లులు మంజూరు అవుతాయన్నారు. రాజుపాలెం సర్పంచ్ రామకృష్ణారెడ్డి బ్రాహ్మణపల్లెలో శ్మశానవాటికలో కొత్త మోటారు ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీ లోపు పంట నమోదును ప్రతి రైతు నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలో 750 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారని, వర్షాభావ పరిస్థితుల వలన 450 ఎకరాలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసి అధికారులకు నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో సెప్టెంబర్ 18వ తేదీ వరకు పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేస్తున్నామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మండలానికి 25 మినీ గోకులాలు మంజూరయ్యాని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ మహబూబ్‌బీ, మండల ఉపాధ్యక్షులు ఎ.వి. భాస్కర్‌రెడ్డి, వావిళ్ళమల్లిక, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

బహిరంగ మద్యం సేవిస్తే కఠిన చర్యలు

పోరుమామిళ్ల : మద్యం తాగి ఆటో నడుపుతుండగా బుధవారం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని తాము హెచ్చరిస్తున్నా కొందరు లెక్క చేయడం లేదన్నారు. బహిరంగంగా మద్యం సేవించినా చర్య తప్పదని తెలిసీ కొందరు అందుకు సాహసిస్తున్నారని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా అనధికారికంగా లే అవుట్లు వేస్తే సంబంధిత స్థల యజమానులు లేదా డెవలపర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ వారి ఉత్తర్వుల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లే అవుట్లలో ప్లాట్లు అమ్మకాలు, కొనుగోలు చేయరాదని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా ప్లాట్లు కొనుగోలు చేస్తే అలాంటి వారికి భవన నిర్మాణ అనుమతులు ఇవ్వబోమని, రోడ్డు, కరెంట్, నీరు, డ్రైనేజీ సౌకర్యం కల్పించమని తెలిపారు.

దేవాదాయశాఖ ఆధీనంలో వీరబ్రహ్మేంద్రస్వామి మఠం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి మఠంను బుధవారం దేవాదాయశాఖ అధికారులు స్వాధీనంలోకి తీసుకున్నారు. సుంకు వెంకటసుబ్బయ్య సత్రానికి చెందిన సర్వే నంబర్ 57/3లోని 1.75 ఎకరాలు స్థలంలో మఠాన్ని నిర్మించారు. దేవాదాయశాఖ అధికారులు మఠం సంబంధీకులకు ఈఓ మూడు సార్లు నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించక పోవడంతో దేవాదాయశాఖ చట్టం 30/87, యూ/ఎస్ 83(2) ప్రకారం పంచనామ చేసి ఒక ఇల్లు, మండపం, ఖాళీస్థలం తదితర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇక నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మఠం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పంచానామ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహాసింగ్, ఈఓ రామచంద్రాచార్యులు, సిబ్బంది, వీఆర్‌ఓ రవి, సర్వేయర్లు సురేంద్ర, రాజేష్‌పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామానికి చెందిన మేకల శాంతయ్య అక్రమ మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ బుధవారం తెలిపారు. వెల్లాల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశామన్నారు. శాంతయ్య వద్ద 24 క్వాటర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అర్బన్ ఎస్ఐ జె.రవికుమార్ తెలిపారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలిద్దాం-భవిష్యత్తును కాపాడుదాం అనే నినాదంతో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను బుధవారం అర్బన్‌స్టేషన్ ఆవరణలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్ళకుండా చదువుపై, క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. అలాగే డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు డీవైఎఫ్ఐ సంఘం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు

ప్రొద్దుటూరు క్రైం : దోమకాటు ఆరోగ్యానికి చేటని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం కామనూరులో ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రతతో పాటు మురికినీళ్లు, చెత్తా చెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని హనీఫ్‌బాబా సూచించారు. దోమ తెరలు వాడితే దోమ కాటుకు గురి కాకుండా పూర్తిగా రక్షణ పొందవచ్చన్నారు. సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య పాల్గొన్నారు.

ఈ పాపం సీఎం చంద్రబాబుదే



మాట్లాడుతున్న గోసా మనోహర్

ప్రొద్దుటూరు : మాల, మాదిగల మధ్య చిచ్చు రగులుతూనే ఉందని, ఈ ఎస్సీ వర్గీకరణ పాపం సీఎం చంద్రబాబు నాయుడుదేనని జాతీయ మాలమహానాడు నేషనల్ ప్రెసిడెంట్ గోసా మనోహర్ మండిపడ్డారు. బుధవారం భారత్ బంద్‌లో భాగంగా ఇంజినీరింగ్ కాలేజీలు, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలను, కొన్ని వ్యాపార సముదాయాలను మూసివేయించారు. అనంతరం రాజీవ్ సర్కిల్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నీరుగారుస్తోందని విమర్శించారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర మహిళా కన్వీనర్ చింతల దానమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సాత్రి సురేష్, కొప్పెళ్ల రవికుమార్, జీకే జ్యోతి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర మాలమహానాడు (రామాజీవర్గం) జిల్లా అధ్యక్షుడు ఉల్లి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లో, మైదుకూరు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఈ సందర్భంగా పూల మాలలు వేసిన అనంతరం నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త బంద్ ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలను మాలమహానాడు ఆధ్వర్యంలో మూసివేయించారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సాత్రి లక్షుమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఖాజీపేట : ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాలమహానాడు నాయకుడు వెంకటరమణ విమర్శించారు. బుధవారం వర్గీకరణకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా ఖాజీపేటలో బంద్ నిర్వహించారు.

మైదుకూరు : రాజకీయ పార్టీలు తమ మనుగడ, రాజకీయ లబ్ధి కోసం వర్గీకరణ పేరుతో దళితులను విడగొట్టవద్దని మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు ఎద్దుల వసంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రకటించిన దేశ వ్యాప్త బంద్‌లో భాగంగా మైదుకూరులో వసంతకుమార్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.

బద్వేలు అర్బన్ : ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి, సీనియర్ దళిత నాయకులు కె.మురళిలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ పట్టణంలో పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ దళితులంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, వర్గీకరణ పేరుతో విడిపోతే నష్టం వాటిల్లుతుందని అన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు అవార్డు



అవార్డును అందుకుంటున్న కేవీకే అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ పిరోజ్ హుస్సేన్

మైదుకూరు : తమిళనాడులో తిరుచ్చి జాతీయ అరటి పరిశోధన కేంద్రం వారు ప్రకటించిన ఉత్తమ కేవీకే అవార్డును బుధవారం మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అందుకున్నారు. వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అరటి సాగులో రైతులకు అందించిన సహాయ, సహకారాలు, శిక్షణను గుర్తించిన తిరుచ్చి జాతీయ అరటి పరిశోధన కేంద్రం ఉత్తమ కేవీకే అవార్డును ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన తిరుచ్చి అరటి పరిశోధన కేంద్రం వ్యవస్థాపక దినోత్సవంలో ఐకార్ ఐజీ సంచాలకులు డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర, అటారి జోన్-10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మేరా, ఎన్ఆర్సీబీ డైరెక్టర్ డాక్టర్ సెల్వరాజన్, అటారి జోన్ -11 డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటసుబ్రహ్మణ్యంల చేతుల మీదుగా వనిపెంట కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ అవార్డును అందుకున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



ప్రభుత్వాసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ హిమదేవి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) హిమదేవి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని, డయాలసిస్ కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రి పరిసరాలు, ఓపీ, ఐపీ గదులను, లేబర్ వార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. పట్టణంలో కొనసాగుతున్న 50 పడకల ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత ఉందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యంగా గైనకాలజిస్టు లేని కారణంగా ప్రసవాల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోందని, త్వరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన రిలేనిరాహార దీక్షలు

బద్వేలు అర్బన్ : పట్టణానికి సమీపంలోని సి.కొత్తపల్లె పొలంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకుని కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట చేస్తున్న రిలేనిరాహారదీక్షలు బుధవారంకు మూడో రోజుకు చేరుకున్నాయి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లడుతూ సి.కొత్తపల్లె పొలంలో కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని 6 నెలలుగా ఆందోళనలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదల గుడిసెలను తొలగించి దళిత మహిళలపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల తనిఖీ

పోరుమామిళ్ల : జిల్లా విద్యాశాఖ అధికారిణి అనూరాధ బుధవారం పోరుమామిళ్ల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులను గమనించారు. ఇలా పిల్లలు నిలబడి తినడం, అక్కడొకరు, అక్కడొకరు ప్లేట్లు పట్టుకుని తినడం చూసిన డీఈఓ ఉపాధ్యాయులతో ఇది పద్ధతి కాదన్నారు. విద్యార్థులందరికీ చాపలు ఏర్పాటు చేసి అందరూ ఒకేచోట కూర్చొని తినాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పాఠ్య ప్రణాళికపై వివరాలు అడిగారు. ఈ సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణత పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు. అనంతరం గిరినగర్ ఎంపీపీ పాఠశాలను ఆమె సందర్శించారు. ఆ పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రూములు పూర్తి అయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఆమె వెంట మండల విద్యాశాఖ అధికారి బాలఅంకిరెడ్డి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.